(5వ పేజీ తరువాయి)

వాసంతి ఓ క్షణం బిత్తరపోయి అతన్ని ఎగాదిగా చూసింది. భయంతో రెండు అడుగులు వెనక్కి వేసింది. గిరుక్కున తిరిగి వెళ్లబోయింది.

సారధి వాసంతి చెయ్యి పట్టుకున్నాడు ఆగమన్నట్టు.

"ఏయ్! మిస్టర్ చెయ్యి వదులు" కరుగ్గా అంది.

"వాసంతి! నేను సారథిని నీ బావను."

"మిస్టర్ నాకెవరూ బావల్లేరు. నా అక్క ఎప్పుడో చచ్చిపోయింది" చెయ్యి విడిపించుకుంటూ అంది.

"మీరన్నా చెప్పండి మిస్..." ఆమె వంక తిరిగి అన్నాడు.

"...మల్లిక! మీ పేరు సారధి. అంతేనా" ఆమె అంది.

"అవును మల్లికగారు. ఈమె నా మరదలు వాసంతి."

"వాసంతి! నిజమేనా?" మల్లిక అడిగింది.

"నా పేరు వాసంతి నిజమేకాని. యితడెవరో నాకు తెలీదు."

"తెలీదూ... మీ అక్క సత్య బతికుంటే ఆ మాట అనేదానివా?" ఆవేశపడ్డాడు సారధి.

"ఊహు! ఆమెని పొట్టన పెట్టుకున్నావుగా... మల్లికా! పద పోదాం. ఇంకాసేపుంటే మనిద్దర్నీ కూడా హత్య చేస్తాడు" వాసంతి మల్లికను లాక్కుపోయింది.

సారధి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

మల్లిక తలతిప్పి చూస్తూ వెళ్లిపోయింది వాసంతితో.

సారధికి అంతా అయోమయంగా ఉంది. వాసంతి వాళ్ల ఊరు ఇది కాదు— చాలా దూరంలో ఉంది. ఆమె యిక్కడికెందుకొచ్చింది!

అప్పుడు లీలగా అతనికి ఆమె మెళ్లో మంగళసూత్రాలు గుర్తుకొచ్చాయి. పెళ్లి చేసుకునుంటుంది. భర్త యిక్కడ పని చేస్తున్నాడని సరిపెట్టుకున్నాడు.

"ఇంకాసేపుంటే మనిద్దర్ని కూడా హత్య చేస్తాడు" అన్నమాట గుండెల్లో బాకులా దిగబడింది.

మెడికల్ షాపు దగ్గర ఆగి స్లీపింగ్ పిల్సు కొనుక్కున్నాడు. మూడు స్లీపింగ్ పిల్స్ వేసుకుని పడుకున్నాడు ఆ రాత్రి.

భారంగా వారం రోజులు గడిచిపోయాయి.

ఆదివారం కదాని బద్ధకంగా కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటూ ఉంటే పల్లవి వచ్చింది పట్టుచీర కట్టుకుని స్వీట్లు తీసుకుని.

"సారధిగారూ! స్వీటు తీసుకోండి" పెట్టె తెరచి యిస్తూ చెప్పింది. "మీకు జాంగ్రీ కావాలా? బాదుషానా... లడ్డా?"

"నాకేదీ వద్దు" తిరస్కరించాడు.

"అదేంటి మీకు షుగరుందా!" ఆశ్చర్యంగా అడిగింది.

"నాకే జబ్బూ లేదు. నాకు స్వీటు యిష్టం లేదు" ముక్తసరిగా చెప్పాడు.

"కాని ఈ రోజు మీరు తీసుకోవలసిందే!" ఆజ్ఞాపించింది.

"ఏంటో ఈ రోజు ప్రత్యేకత!"

"నిన్న నాన్నగారు క్షేమంగా ఇంటికి వచ్చారు.."

"కాని నిన్ననే యివ్వాల్సింది."

"కాని ఈ రోజు నా పుట్టినరోజుగా!"

"ఐసీ! ఎన్నో వసంతం?"

"చెప్పకూడదంటారు. అయినా మీకు కాబట్టి చెబుతున్నా. ఆ చెవి యిలా యివ్వండి."

అతని మీదకు ఒంగి చెప్పింది చెవిలో.

"పద్దెనిమిదో ఏడు అని అమ్మ చెపుతుంటుంది... కాని... ఇరవై ఒకటి వచ్చింది నాకు" సిగ్గుపడుతూ చెప్పింది.

"మెనీ మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" పెట్టెలోంచి స్వీటు తీసుకుంటూ చెప్పాడు.

పల్లవి చాలా అందంగా ఉంటుంది. అమాయకత్వం కూడా ఆమె కళ్లల్లో కనిపిస్తూ ఉంటుంది.

## విధి వించితుడు

"ఇంకొకటి కూడా తీసుకోండి."

"ఎందుకు... నాకు ఒకటి చాలు."

"మీకు కాదు... అక్కయ్యకి" అంటూ యింకో స్వీటు అతనికిచ్చింది. అతని సమాధానం కోసం చూడకుండా వెళ్లిపోయింది ఆమె.

అతని కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఆ స్వీటు తీసుకుని పెరట్లో ఉన్న గోడపైన పెట్టాడు. ఎక్కడినుంచో ఓ కాకి వచ్చి నోట కరుచుకుని వెళ్లిపోయింది.

కాసేపటికి అరవింద్ వచ్చాడు. అతను సారధికి ఫ్రెండ్! ఆఫీసు వేరే అయినా రోజూ దార్లో కలుసుకుంటూ ఉంటారు.

"సారధీ! నాకు సాయం చెయ్యాలి."

"ఏం అరవింద్?"

"సాయంత్రం ప్రోగ్రామ్స్ ఏమీ లేవుగా... ఉన్నా కాన్సిల్ చేసుకో... ఈ సాయంత్రం నాకోసం వెచ్చించాలి."

"సినిమాకా?"

"ఛ! అలా నీ టైం వేస్టు చేస్తానా? ఒంటి లింగం శొంఠి కొమ్ములు అని నీకు తెల్సుగా సమయానికి ఒక్క క్లోజ్ ఫ్రెండ్ కూడా ఊళ్లో లేదు... వాళ్లేమో తొందరపడుతున్నారు. అందుకని నువ్వు తోడుగా రా!"

"ఇంతకి ఎక్కడో చెప్పలేదు."

"జస్టు... పెళ్లిచూపులకి"

"నీకే!" బోల్డు ఆశ్చర్యపోయాడు.

సాయంత్రం అమ్మాయిని చూసి యింకా ఆశ్చర్యపోయాడు.

పున్నమి వెన్నెలలా అందంగా ఉంది ఆమె!

"మీ పేరు?" అరవింద్ ప్రశ్న.

"మల్లిక" తియ్యగా మృదువుగా చెప్పింది.

ప్రశ్నల వర్షం కురిపించాడు. ఆమె తడుముకోకుండా సమాధానాలు చెప్పింది. సారధికి చిత్రంగా ఉంది. పెళ్లిచూపుల్లో అన్ని రకాల ప్రశ్నలు అడుగవచ్చని అతనికి తెలియదు.

"బాబూ! అమ్మాయి నచ్చిందీ లేందీ తొందరగా తెలియజెయ్యండి. హోగ పేషంటును. సస్పెన్సులు పెట్టవద్దు" వీడ్కలిస్తూ మల్లిక తండ్రి చెప్పాడు.

సారధి సాభిప్రాయంగా అతని వంక చూశాడు. అతను కళ్లు ఎగరేశాడు.

అరవింద్ మరునాడు సారధి దగ్గరికి వచ్చి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఎంతోమందితో ఎన్నో సంబంధాలు చూశాడట! కాని ఇంత వరకు ఏదీ నచ్చలేదుట! ఎందుకో మల్లిక నచ్చిందట!

"మరింకేం... తెలియ చెయ్యి!" అభినందిస్తూ అన్నాడు.

"మీడియేటర్‌కి చెబుతాను. అతనికోసమే పోతున్నాను" గాల్లో తేలిపోతూ వెళ్లిపోతూ చెప్పాడు.

కనీసం తనని అతను ఆ విధంగా ఉపయోగించుకోగలిగినందుకు సారధికి సంతోషంగా ఉంది.

మరునాడు... ముందుకు పోతున్న అరవింద్‌ను అందుకుని సారధి అడిగాడు కుతూహలంగా...

"ఏంగురూ! అంత నీరసంగా పోతున్నావ్! పెళ్లి కావాల్సినవాడివి... గుర్రంలా హుషారుగా ఉండాలి."

అరవింద్ శూన్యంలోకి చూస్తూ... ఓ వెకిలి నవ్వు నవ్వాడు. అతన్ని గమనించనట్టు ముందుకు పోబోయాడు.

"అరవింద్! ఎప్పుడు పెళ్లి? నన్ను మర్చిపోవుకదూ?"

"పెళ్లా! నా పిండాకూడా?" అతను సీరియస్‌గా అన్నాడు.

అదిరిపడ్డాడు సారధి. "అదేంటి? మధ్యవర్తి ద్వారా మల్లికకు నీ అంగీకారం తెలుపలేదా?"

"నేనొప్పుకుంటేనే పెళ్లి అయిపోతుందా?"

"నీకేం తక్కువ? అన్నీ ఉన్నవాడివి! ఏం ఆమెకిష్టం లేదా? నీలాంటి వరుడు ఎక్కడ దొరుకుతాడు? ఆమెతో నేమాట్లాడనా?"

"అక్కరలేదు... నీతో పోవడమే నా కొంప ముంచింది. నీ ఫ్రెండు కావడమే నేచేసుకున్న పాపం!" తలవిదిలించి అరవింద్ కాళ్లీడ్చుకుంటూ వెళ్లిపోయాడు.

భూమిలోకి పాతుకుపోయినట్లు నిశ్చలంగా నిల్చుండిపోయాడు సారధి!

భారంగా కదిలిపోతున్న అరవింద్‌ను చూస్తూ ఉండిపోయాడు. మసక మసగ్గా అలికేసినట్లు కనిపిస్తున్నాడు.

ధారగా కారుతున్న కన్నీటిని తుడుచుకోవాలన్న ధ్యాస లేకుండా అటే చూస్తున్నాడు సారధి!

'జీవితంలో ఓడిపోయి పూర్తిగా ఒంటరివాడినై పోయాన'ని బాధపడ్తూ తలవంచుకుని గిరుక్కున వెనక్కి తిరిగి ముందుకు నడిచాడు సారధి.

●